# అవగాహన

ముద్దంశెట్టి హనుమంతరావు



ఎంతో ప్రయత్నంమీద రిజర్వుడు కంపార్టుమెంటులో రెండు సీట్లు సంపాదించిన రాజు, భార్యను అక్కడ కూచోబెట్టి, కిందికి దిగి అన్నయ్య కేశవరావు దగ్గరికొచ్చాడు.

కేశవరావు హుందాగా నుంచున్నాడు. అతని మొహంలో గంభీరత కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది ఎల్లప్పుడూ అతను అంత సీరియస్‌గానే వుంటాడేమోనన్న అనుమానం, అతని మొహం చూసిన వాళ్ళకి తట్టకపోదు.

“రాజూ, నువ్వు విజయనగరంలో కొత్తగా కాపురం పెడుతున్నావు. మీరిద్దరే వుంటారు. పెద్ద దిక్కంటూ యింకెవ్వరూ వుండరు. నిన్ను అడిగే వాళ్ళెవరూ లేరని, నీ యిష్టమొచ్చినట్టు సరదాలకీ, విలాసాలకీ అనవసరంగా

ఖర్చుపెట్టకు. నీ చదువుకి బోలెడు ఖర్చయ్యింది. దాంతో నేను బాగా దెబ్బ తిన్నానన్న విషయం నీకు తెలిసిందే. నాకు పంపించాల్సిన డబ్బు మాత్రం, జీతం అందిన తక్షణం పంపడం అల వాటు చేసుకో?" అంటూ సూచాయగా కొన్ని ఆంక్షలు విధించి, తన ఆధిక్య తను నిలబెట్టుకున్నాడు, కేశవరావు.

"నువ్వే యీ విషయాన్ని యిన్నిసార్లు చెప్పాలా అన్నయ్యా! నా బాధ్యత నాకు తెలీదూ!" సవినయంగానే అన్నాడు, రాజు.

రాజుకి అన్నయ్యంటే భయం, భక్తి, రెండూ సమపాళ్ళల్లో వున్నాయి. అన్నయ్య యెదుట గట్టిగా మాట్లాడటం, అతనికి యిప్పటికీ చేతకాని పని. అటు వంటి వాతావరణంలో పుట్టిపెరిగాడతను. అందుకే, అన్నయ్య యేం చెప్పినా, డూ డూ బసవన్నలా అన్నింటికీ బుర్ర వూపేస్తాడు, "నీ సంగతి సరేగాని! నువ్వెప్పుడూ నా మాటకి యెదురు చెప్పవన్న సంగతి నాకు బాగా తెలుసు. కాని, నీ జీవితంలోకి యిప్పుడో కొత్త వ్యక్తి అడుగుపెట్టింది. ఆమె నీ అర్ధాంగి రాధ! ఆమె మనస్తత్వం మనకు సొంతం తెలీదు అందుచేత యే పరి స్థితుల్లో కూడా నువ్వామెకి చనువివ్వ కూడదు ఆమెకి యేమాత్రం చనువి చ్చినా, ఆమె నిన్ను తన గుప్పెట్లో పెట్టుకుంటుంది. నీకు వ్యక్తిత్వం లేకుండా చేస్తుంది. ఇది మాత్రం గుర్తుంచుకో!"

"అలాగేనన్నయ్యా!" అని మాత్రమే అనగలిగాడు, రాజు.

కేశవరావు యీ హెచ్చరిక చెయ్య డంలో, కేవలం తమ్ముడి వ్యక్తిత్వం పోతుందేమోననే కాదు — తమ్ముడు భార్య చేతిలో కీలుబొమ్మగా మారి, తనకి చేస్తోన్న ఆర్థిక సహాయాన్ని నిలిపేస్తాడేమోనన్న అనుమానమే ముఖ్య కారణం.

గార్డు విజిల్ వూదాడు. కూత కూసు కుంటూ రైలు కదిలింది. రాజు కంపార్టు మెంటెక్కి హేండిల్సు పట్టుకుని చెయ్యి వూపుతున్నాడు. కేశవరావు మరదల్ని వుద్దేశించి "వుంటానమ్మా!" అని లాంఛనంగా చెబుతూ చెయ్యి వూపాడు. బండి కనుచూపుమేర దాటాక, కేశవ రావు బరువుగా ఓ నిట్టూర్పు విడిచి, ఇంటి ముఖం పట్టాడు. రాజు, వచ్చి రాధ ప్రక్కనే కూర్చున్నాడు. రైలు వేగాన్ని అందుకుని ముందుకు సాగి పోతోంది.

* * *

రాజు, రాధతో కొత్త కాపురం హుషారుగా, ఆనందంగా సాగిపోతోంది. రాధ, తెలివైన అమ్మాయి. భర్తకి అను కూలంగా మసలుతోంది. అయితే, బావ గారు ఆయనకి రాస్తున్న వుత్తరాలు చదువుతూ వుంటే, ఆమెకి అనుకోకుండా ఆవేశం వస్తోంది. ప్రతి ఉత్తరంలోనూ,

తననుండి జాగ్రత్తగా వుండమని, భర్తని హెచ్చరిస్తూ వుండటం, ఆమెకి అవమానంగా తోచింది.

"ఇదేమిటండి నేనేదో విరోధిని అయినట్టు, మీకు అపకారం చెయ్యడానికి మీకు భార్యనైనట్టు, నానుండి జాగ్రత్తగా వుండమని రాస్తుంటారేమిటి బావగారు!" అందో రోజు విసురుగానే

రాజు చిన్నగా మందహాసం చేశాడు.

"ఓ! అదా! ఆయన మనస్తత్వం అంతేలే రాధా! నువ్వేమీ బాధపడకు." అదేమంత పట్టించుకోవల్సిన విషయం కాదన్నట్టుగా తేలిగ్గా అనేశాడు.

"మీరవుతే అంత తేలిగ్గా కొట్టిపారేస్తున్నారుగాని! నన్నా విషయం యెంతగా బాధిస్తున్నదో, మీరు అర్థం చేసుకోవడం లేదు. ఉత్తరాల్లోనే నా గురించి యిలా రాస్తున్నారు కదా, యితరులతో యింకేమేమి చెబుతున్నారో యెవరికి తెలుసు!"

"ఆయన మనస్తత్వం తెలిసిన వాళ్ళెవరూ, ఆయన మాటల్ని పట్టించుకోరులే రాధా! నువ్వేమీ బాధపడకు."

"అయినా యీ పద్ధతి నాకేం నచ్చలేదండీ!" మొహం ముడుచుకుంటూ చెప్పింది, రాధ

వివాహమయ్యాక, రాధ మొహం ముడుచుకోవడం, యిదే ప్రథమం. రాజు, అందుకే కించిత్ బాధపడ్డాడు.

"సరేలే రాధా! మళ్ళీ యిటువంటి వుత్తరాలు రాయొద్దని అన్నయ్యకి రాస్తాలే!" అని చెబుతూ, అప్పటికేదోలా భార్యని వూరడించాడు. రాజు.

* * *

రోజులు గడుస్తున్నాయ్. కేశవరావు తమ్ముడికి మూడు పేజీల ఉత్తరం రాశాడు. దాన్నిండా యేవో మందలింపులూ, ఆంక్షలూను! కేశవరావు పెద్దరికాన్ని ఆధిక్యతని నిలుపుకోవాలన్న ప్రయత్నం ఆ ఉత్తరం ఆసాంతం అగుపిస్తోంది. అది చదువుకుని, రాజు నవ్వుకున్నాడు. కాని, రాధ నవ్వలేదు. ఆమె మొహం రంగు మార్చుకుంది. బావగారి ఆధిక్యత, అజమాయిషీ, రోజు రోజుకీ పెరిగిపోతూ వుండటం సహించలేక పోయింది.

"ఉత్తరం చదువుకున్నారు. మీకు బాధ అనిపించలేదూ!" సూటిగా భర్త మొహంలోకి చూస్తూ ప్రశ్నించింది.

రాజు నవ్వేడు.

"లేదు రాధా! అన్నయ్య తెలివిహీనతకి నవ్వొస్తోంది."

"అంటే?"

"నన్నింకా అన్నయ్య చదువుకుంటోన్న చిన్నపిల్లాడిని చూసిన దృష్టితోనే చూస్తున్నట్టున్నాడు. కాకపోతే యేవిటి? సినిమాలు చూడకూడదు. బట్టలు స్వంతంగా యెన్నుకుని కుట్టించుకోకూడదు సిగరెట్లు త్రాగకూడదు. పార్టీలకు వెళ్ళకూడదు. స్నేహితులతో తిరక్కూడదు. ఇవన్నీ ఆయన వేసిన

అంశలు. అయితే, వీటిని అమలుపర్చ దం, యీ రోజుల్లో సాధ్యమా ! ఈ పాటి ఆలోచన అన్నయ్యకి యెందుకు లేదా, అని ఆశ్చర్యపోతున్నా."

రాధ, నిట్టూర్చింది భర్తకి, వాళ్ళ అన్నయ్య ఘాటు ఉత్తరం యేమాత్రం చలనం కలిగించకపోవడం, ఆమెకి వింతగానే తోచింది. తనలో పెల్లుబికిన వుద్రేకాన్ని అణుచుకోలేకపోయింది.

"ఇంకా నయం. కనీసం, అపాటి ఆలోచన అయినా మీ అస్వతంత్రపు మెదడులోకి వచ్చింది. అందుకు సంతోషిస్తున్నాన్నేను. అయినా, యింత అధ్వానం యేవిటండీ ? ఎంత అన్నయ్య అయినా, యిన్ని కట్టుబాట్లు యెక్కడ వుంటాయా ? ఏమో బాబూ, నేనెక్కడా విన్నట్టు గుర్తు లేదు."

"ఎందుకు వుండవూ? మా అన్నయ్య రాంటి వాళ్ళున్నచోట వుండొచ్చు. పోనీలే రాధా ! రాసినంతవరకే ఆయన బాధ్యత. వాటిని అమల్లోకి తీసుకురావడం, రాకపోవడం, మన బాధ్యత. వూరుకుందే పోయె..."

"ఏమో, నాకు మాత్రం యీ పద్ధతి యేమీ నచ్చలేదండీ ! ఇప్పుడీ అంశలు విధించారు. రేప్పొద్దున మరో ఉత్తరం హఠాత్తుగా వస్తుంది...భార్యతో కాపురం చెయ్యొద్దు...ఆమెని పుట్టింటికి పంపించెయ్ అని...అప్పుడేం చేస్తారు ?" అతని మొహంలోకి చిలిపిగా చూస్తూ అంది.

రాజుకి చురుక్కుమనిపించాయా మాటలు.

"డోంట్ బి సిల్లీ రాధా ! చెప్పాను కదా, ఆయన యేం రాసినా మనం పట్టించుకోవద్దు. ఆయన రాసినవన్నీ తు. చ. తప్పకుండా అమలుపరిచే టంతటి దద్దమ్మను కాదు నేను. నాకూ వ్యక్తిత్వం, ఆత్మాభిమానం, వున్నాయ్." కాస్త హుందాగానే చెప్పాడు, రాజు.


రాధ, తృప్తిగా వూపిరి పీల్చింది. "హమ్మయ్య ! ఆ మాటన్నారు. ఎంతో బావుంది. ఇంతవరకూ మీ ధోరణి చూస్తుంటే, మీకు వ్యక్తిత్వం పట్ల ధ్యాస లేదేమోననిపించింది. ఇప్పుడు నా సందేహం తీరిపోయింది." అంటూ అక్కణ్ణించి వెళ్ళిపోయింది, రాధ.

రాజు, బరువుగా ఓ నిట్టూర్పు విడిచి, విసురుగా టేబిలు దగ్గరికి వెళ్ళి, లెటర్ పాడ్ తీసి, అన్నయ్యకి ఓ ఉత్తరం రాయడం ప్రారంభించాడు. ఉత్తరం పూర్తి చేసి, ఓసారి చదువుకున్నాడు.

'పూజ్యులు అన్నయ్యగారికి,

నమస్కారములు.

మీ ఉత్తరం అందింది. ఇంతకు ముందు మీరు రాసిన ఉత్తరాలకి, యిది చాలా భిన్నంగా వుంది. నా అన్నగారుగా మీరు నన్ను అదుపులో పెట్టవచ్చు. అంశలు విధించవచ్చు. కాదనను. కాని, వాటికీ హద్దుండాలి కదా ! నేను చదువు



తున్నవాణ్ణి. ఉద్యోగం చేసుకుంటున్న వాణ్ణి. వివాహితుణ్ణి. నాకూ వ్యక్తిత్వం, ఆత్మాభిమానం వున్నయ్. మరి నన్నో పరిధిలో పెట్టి నడిపించడానికి ప్రయత్నించడం, నా వ్యక్తిత్వం మీద దెబ్బ తీసినట్టే అవుతుంది. గ్రహించగలరు. వదినగారికి వందనాలు చెప్పండి. చిరంజీవులకు ఆశీర్వాదాలు.

మీ తమ్ముడు – రాజు

* * *

తమ్ముడు రాసిన వుత్తరం చదువుకున్న కేశవరావు, నిప్పు త్రొక్కిన కోతిలా గంతులేశాడు. ఎదుట తమ్ముడు లేకపోయాడుగాని, వుంటే యేం జేసేవాడో ! పళ్ళు పటపట కొరికాడు. రాజు యెంతగా మారిపోయాడు ! కాదు... వాడు మారలేదు. వాడి భార్యే వాణ్ణి మార్చివేసింది. వాణ్ణి చేతిలో కీలుబొమ్మను చేసి ఆడిస్తోంది...వుక్రోషంతో అనుకున్నాడు. ఉత్తరాలద్వారా వాణ్ణి మార్చడం సాధ్యంకాదు ... స్వయంగా వెళ్ళాలి ... అనుకుని బయల్దేరాడు.

* * *

అన్నయ్య హఠాత్తుగా మేఘం లేని వర్షంలా వూడిపడ్డం, రాజుకి ఆశ్చర్యం కలిగించింది. రాధ మాత్రం విస్తుపోలేదు.

ఆమెకి తెలుసు—భర్త రాసిన ఉత్తరం బావకి కోపమెత్తించి వుంటుందని, అందుకే ఆయన వున్నపాటున బైలుదేరి వచ్చారని వూహించింది.

ఆమె వూహించినట్టుగానే, కేశవరావు ఆవేశంతో యేవేవో అంటున్నాడు. రాజు, యింతకు ముందులా మౌనంగా వినకుండా, తగిన జవాబులు చెబుతున్నాడు. తమ్ముడి జవాబులన్నీ మరీ జీర్ణించుకోలేక, వుద్రిక్తుడౌతున్నాడు కేశవరావు.

"నువ్వు పూర్తిగా మారిపోయావురా రాజూ! అసలు, యీ విషయంలో నిన్ను అనాల్సిన పని లేదు. నిన్నిలా మార్చిన వాళ్ళను అనాలి," పళ్ళు కొరుకుతూ అన్నాడు,

ఆ మాటల వెనుకగల నిగూఢార్థాన్ని గ్రహించిన రాధ, భర్తకేసి అదోలా చూసింది. రాజు ఆమె అభిప్రాయాన్ని అవగాహన చేసుకున్నాడు. అతనిలోని వ్యక్తిత్వం వొళ్ళు విర్చుకుని లేచింది.

"అన్నయ్యా, ఇంతవరకూ మీరు యేన్ని అంటున్నా, ఓర్పుతో సహించాను...అందుకు కారణం, మీ మీదుండే గౌరవమే! రాధని అకారణంగా మీరు ఆడిపోస్తూ వుంటే, నా సమక్షంలో నా అర్థాంగిని నిందిస్తూ వుంటే, నేను సహించలేను. నా మార్పుకి కారణం ఆమె కాదు. ఇందులో ఆమె కేమీ ప్రమేయం లేదని గ్రహించడం, మంచి," అన్నాడు.

కేశవరావు నివ్వెరపోయాడు. తన సమక్షంలో కూడా తమ్ముడు అలా జవాబు చెబుతున్నందుకు; తాను కలలో నైనా వూహించలేనంతగా వాడు పెరిగి పోయాడేమో!...అనుకున్నాడు. అతని కళ్ళు నిప్పులు క్రక్కుతున్నాయ్.

"ఇంతవరకూ వచ్చిందన్నమాట వ్యవహారం! నువ్వు చాలా పెరిగిపోయి నట్టున్నావురా! నీతో వాదన అనవసరం. నీ కోసం, చదువు కోసం, నేను ఖర్చు పెట్టిన డబ్బంతా పదేయ్...కనీసం పది వేలయినా అయ్యుంటుంది?" కోపంగానే గర్జించాడు.

రాధ తెల్లబోయింది. రాజు, వుద్రేక పడలేదు. మెల్లగా మందహాసం చేశాడు. అన్నయ్య తెలివి తక్కువతనానికి, జాలివేసింది

"మీరు అనవసరంగా ఆవేశపడు తున్నారన్నయ్యా? నా కోసం ఖర్చు పదివేల రూపాయలే అయ్యిందను కోండి. నా అన్నగా, నా గార్డియన్‌గా, నా కోసం, నా అభివృద్ధికోసం మీరు ఖర్చుపెట్టడం, అది అప్పు క్రిందే వస్తుందంటారా? నన్ను అభివృద్ధిలోకి తీసుకురావడం, మీ కర్తవ్యంగా భావించడం లేదా మీరు? అదే మీ అభిప్రాయం అవుతే, ప్రతి సంవత్సరం పంటలో వస్తోన్న నా భాగం యేమవుతున్నట్టు?

దాని విలువ కూడా కట్టాలి కదా ? అసలు, అటువంటి ప్రసక్తే రాకూడదన్నయ్యా ? మీరు ఆవేశంతో యేదో అనేశారు...కాని, నేను అనలేను..." మెల్లగానే అన్నాడు రాజు.

కేశవరావు మొహం,మ్లానమయ్యింది. రాజు అన్నట్టు ఆ పంట విషయం ?... అయినా అభిమానం ఒహటి యేడ్చింది కదా !

"సరే ! అదీ లెక్క వేద్దాం..." నసుగుతూ అన్నాడు. కేశవరావు

రాధకి యీ వాగ్వివాదం సుతరాం నచ్చలేదు. నిజానికి బావగారి అజమాయిషీ ఆధిక్యత ఆమెకి అసంతృప్తి కలిగించినా, వాళ్ళంటే ఆమెకి ద్వేషం లేదు. అన్నదమ్ముల వివాదం విపరీత పరిస్థితికి దారితీస్తుందేమోనని ఆమెకి భయంవేసింది కలిగించుకోక తప్ప లేదు.

''బావగారూ ! నేను మీకు సలహాలిచ్చేపాటిదాన్ని కాదనుకోండి. అయినా, మీ వాగ్వివాద ధోరణి చూస్తుంటే, చినికి, చినికి, గాలివానగా రూపొందుతుందేమోనన్న భీతి యేర్పడుతుంది. అందుకనే, కలిగించుకోక తప్పడం లేదు మీరు పెద్దవారు. ఆయనకి తండ్రి తరవాత తండ్రిలాంటివారు. ఆయన పురోభివృద్ధికై మీరు ఖర్చుబెట్టిన పైకాన్ని అప్పు తీర్చమనడం, మీ గౌరవానికే భంగకరం ఎవరు విన్నా హర్షించరు. మీరు అలా ఆవేశంలో అనేసినా, ఆయన కూడా తొందరపడి పంటలో తన భాగం గురించి ప్రస్తావించడం, సబబుగా లేదు. సమిష్టి కుటుంబంలో ఒకరి నొకరు అవగాహన చేసుకోవడం చాలా అవసరం. అన్ని సమయాల్లో ఆధిక్యత విజయం సాధించలేదు బావగారూ ! మంచిగా మనస్సుని మార్చినంత సుళువుగా, ఆధిక్యతతో అధికారంతో మార్చలేం. మీరిరువురూ మాటకి మాటా పెంచుకున్నారనుకోండి ... పర్యవసానం యేవిటి ? విడిపోతారు. మీకు ఇంత వరకూ అందుతోన్న సహాయం ఆగిపోతుంది. ఇక మా విషయం అంటారా? సంపాలిచ్చే పెద్దవాళ్ళు కొరవవుతారు మాకు. అప్పుడు యీ నిందంతా నా నెత్తిన పడుతుంది — నేను మీ ఇంటికి కోడలుగా వచ్చాకనే మీరు విడిపోయారని, ఇవన్నీ యెందుకు చెప్పండి ? కాలం శరవేగంతో మారుతోంది మారుతోన్న కాలంతోపాటు, మనిషిలోని స్వేచ్ఛా భావాలు మరింత పటిష్ఠమౌతున్నాయ్ అంచేత కాల గమనాన్ని గుర్తించి, మీరూ మీ తమ్ముడికి స్వేచ్ఛనివ్వాలంటున్నాను. మేం బాధ్యత నెరిగిన వాళ్ళమన్న నిజాన్ని మీరూ గుర్తించాలి బావగారూ ! అనవసరంగా మీరు ఆవేశపడి, వాతావరణాన్ని అస్తవ్యస్తం చెయ్యొద్దని సవినయంగా మనవిచేసుకుంటున్నాను. మీ పట్ల మా

యితపురికీ యెప్పుడూ గౌరవం, పూజ్య భావం, వున్నయ్...వుంటాయి కూడా. అది మాత్రం మర్చిపోకండి." అంటూ చిన్న వుపన్యాసమిచ్చింది రాధ సాహసించి.

భార్య యింత ధైర్యంగా అన్నయ్య సమక్షంలో మాట్లాడినందుకు విస్తుపోయాడు రాజు. తమ్ముడికంటె అత్యధికంగా ఆశ్చర్యపోయాడు, కేశవరావు. అయితే ఆమె మాటలు ఆయనలో ఆలోచనల్ని రేకెత్తించాయి. ఆవేశాన్ని ఓ మూలకి నెట్టాయి. ఆమె చెప్పినదాంట్లో అసత్యం యేమీలేదనిపించింది దూరంగా యోచిస్తే; తాను వృద్ధికుడై, ఆధిక్యతతో, అజమాయిషీ చెలాయించాలన్న వుద్దేశంతో ప్రవర్తిస్తే, యెప్పటి కయినా నష్టపోయేది తనేనన్న నిజాన్ని యిప్పుడు గ్రహించాడు. అతని మొహంలో రంగులు మారాయి. కళ్ళల్లో కోపం చల్లబడినట్లయింది.

రాజు, అన్నయ్యకేసి వింతగా చూశాడు. రాధ మాటలకి అన్నయ్య మౌనం దాల్చటం, ఆలోచనలో పడ్డం, ఆశ్చర్యం కలిగించింది.

"రాధా; నాలోని అహాన్ని యెత్తి చూపి, నాకు కనువిప్పు కలిగించావమ్మా: నా ప్రవర్తనకి నేనే సిగ్గుపడుతున్నాను......" అంటూ తమ్ముడి భుజంమీద చెయ్యివేసి "నేనే, తొందర పడ్డానురా తమ్ముడూ; మరేం అనుకోకు. నా మన స్తత్వం నీకుతెలిసిందేగా;" అన్నాడు. అతని గొంతు బొంగురుపోయింది.

రాజు కళ్ళు మెరిశాయి. అతని మొహం వికసించింది. అన్నయ్యలో మార్పు వచ్చినందుకు మురిసిపోయాడు. రాధ ఆనందం వర్ణనాతీతం.

"అన్నయ్యా; నా కిప్పుడెంతో ఆనందంగా వుంది..." అన్నాడు రాజు.

రాధ ముసిముసి నవ్వులు నవ్వుకుంది అన్నదమ్ముల్ని చూచి.

"మా మరదలు యేమిటో అనుకున్నాను రా, నన్నే మార్చేసింది. మన ఐక్యతను కాపాడింది." ఉత్సాహంగా అన్నాడు కేశవరావు, రాధ కేసి చూస్తూ.

"హమ్మయ్య; గాలివాన వెలిసినట్టయ్యింది. అంతేచాలు. కాఫీ తెస్తానుండండి." అంటూ లోపలికి తుర్రుమంది రాధ.

అన్నదమ్ములిద్దరూ నవ్వుకున్నారు నిండుగా.